

సాహసంతో సమకూడిన సంతృప్తి మనుషుల్ని చిద్విలాసాలతో చిటారుకొమ్మల్లో నిలబెడుతుంది విజయనిర్మల కళ్ళల్లో కమ్మని సంతృప్తీ పరువాల్లో పసందైన మార్పూ మరింతగా ఏర్పడ్డాయి యిటీవల. చెట్టెక్కి కూర్చుంది. తోక ఒకటే తక్కువిప్పుడు! దిగ్విజయావారి "ప్రేమకానుక" లో పరవళ్ళుత్రొక్కింది ప్రతిభతో.

"నేనెందుకు మళ్లీ పెళ్లి చేసుకున్నాను!"

ఇంటర్వ్యూలో విజయనిర్మల

త్రాగుబోతులున్నారు జాగ్రత్త!

(లోపలి పేజీలలో) హీరో వీరనాధ్ రచన...

మూడు మాటలు

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు చలన చిత్రజీవిత రజతోత్సవం జరుగుతున్న శుభ దినాలివి. పదడుగులు ముందుకువెళ్ళిన తర్వాత ఒకసారి మరోసారి మరోసారి వెనక్కు తిరిగి చేతులు ముకుళించి తనను ముందుకు నడిపిన ప్రతి ఒక్కరికీ తన కృతజ్ఞతలు చెప్పుకుంటూ వుంటా రాయన ఆ మనిషే వేరు! ఆ తీరే వేరు! ఆ నటసామ్రాట్ కు మా శుభాభినందనలు.

ఇటీవలి పరిణామాల్లో ఆంధ్రదేశం కాగడామీదా కాగడా శర్మమీదా ప్రత్యేక శ్రద్ధనూ ఆసక్తినీ ఆత్మీయతనూ ఆందోళననూ విశేషంగా ప్రదర్శించింది. ప్రదర్శిస్తోంది. ఆ మహాభిమానానికీ ప్రేమకూ కృతజ్ఞత మాటల్లో ఎలా చెప్పగలం? కృతజ్ఞులం అనడం తప్ప - ఎలా వర్ణించాలి మా ఆనందాన్నీ గర్వాన్నీ! దీక్షతో న్యాయ దృక్పథంతో మీ ఆశీర్వచనంతో ముందడుగు వేస్తాం అనిమాత్రం హామీ యిస్తున్నాం.

పోతే—పోస్టల్ సౌకర్యాల దృష్ట్యా "కాగడా" ప్రతి 10 - 25 తేదీలకు బదులు ప్రతి 1 - 15 తేదీల్లో పాఠకుల చేతుల్లో వుంటుందని మనవి చేస్తున్నాం. తిరిగి యీనెల 30వ తేదీకే మార్కెట్లో వుంటుంది.

—ఎడిటర్.

సినిమా రవ్వలు

పాండీ బజారు లక్ష్మణ్ స్టూడియో అధిపతి లక్ష్మణరావు కళాచిత్ర బేనర్ మీద తెలుగులో ఒక సాంఘికాన్ని నిర్మిస్తున్నాడు. లక్ష్మణరావు తొలినుంచీ కష్టజీవి. నర్సాపురంనుంచి మద్రాసుకు ఫోటోగ్రఫీపనిలో బ్రతకడానికి వచ్చాడు. కొన్ని చిత్రాలకుకూడా స్టిల్స్‌పని చేశాడు. క్రమంగా పాండీబజార్లో ఒక స్టూడియో కూడా పెట్టుకున్నాడు. తద్వారా ఒక చిన్న ప్రింటింగ్ ప్రెస్ నెలకొల్పుకున్నాడు. అందరికీ స్నేహ పాత్రుడుగా ఎంతో మంచపేరు తెచ్చుకున్నాడు. స్నేహితులతో రాజసభలా కిటకిటలాడుతూ కళకడుతూ వుంటుందెప్పుడూ అతడి స్టూడియో క్రమంగా నలుగురు సన్నిహితులు చేయూతనిస్తే పై చిత్రనిర్మాణ సంస్థను స్థాపించుకుని పనిసాగిస్తున్నాడు. దాదాపు నాలుగు రీళ్ళు అయింది. హరనాథ్ రాజశ్రీ నాయక నాయకీమణులుగా నటిస్తున్నారు. నిర్విరామకృషి వున్నవాడు గనుక యిందులోకూడా అతడు విజయాన్ని సాధిస్తే యెంతవాడైనా కాగలడు త్వరలోనే. ఉత్సాహం. కృషి, పట్టుదలా వున్న యిలాటి యువకులకు పరిశ్రమా నటీనటులూ సాంకేతికులూ తగురీతిగా అన్ని విధాలా సహకరించాలి. లేదంటే ఎంతో ముందుకు పోగల వ్యక్తులు మధ్యలోనే చతికిల బడిపోవలసివస్తుంది.

* * *

హీరోయిన్స్ కొరతబాగా పెరిగిపోయింది పరిశ్రమకు. అందరూ బిజీ అయిపోయారు. చిత్రనిర్మాణ సంస్థలు తెగ పెరిగిపోయాయి. ఇది మంచిదే. కాని దానితోబాటుగా ప్రతి నిర్మాతాకూడా ఒక హీరోనో హీరోయిన్నో కొత్తవాళ్ళని పెట్టడానికి ప్రయత్నిస్తే బాగుండును. అందుకు డిస్ట్రిబ్యూటర్ల అండదండలు కూడా అవసరం. డిస్ట్రిబ్యూటర్సు కొత్తవాళ్ళ పేరు చెప్పగానే "అమ్మో! కొత్తవాళ్ళా! వద్దు - పాతవాళ్ళని పెడితేనే పదివేలు మిగలడం లేదు" అని భయపెడుతున్నారు. నిర్మాత తను యెంత డబ్బు తెచ్చినవాడైనప్పటికీ డిస్ట్రిబ్యూటరు చెప్పినట్టు చెయ్యవలసినవాడు. కారణం నిర్మాత పెట్టేదానికి నాలుగురెట్లు పెట్టవలసింది డిస్ట్రిబ్యూటరే గనుక. నిర్మాత భవిష్యత్తుకంటె తన భవిష్యత్తూ గ్యారంటీ ముందు చూసుకుంటాడు డిస్ట్రిబ్యూటరు. ఇందులో తప్పేమీ లేదు. అయితే పిల్లికి యెవరు గంటకడతారన్నదే ప్రశ్న అయింది. "కొత్తవాళ్ళని పెట్టుకో. కాని ప్రింట్సుకి మాత్రమే నేను డబ్బిస్తాను. తక్కిన నాలుగు లక్షలూ నువ్వే తెచ్చుకో" అని డిస్ట్రిబ్యూటరు అంటే నిర్మాత ఏంచేస్తాడు? తను స్తోమతు వున్నవాడైనా ఆ మాటలతో భయపడతాడు. నిర్మాతా డిస్ట్రిబ్యూటరూ యిక్కడే ఒక్క విషయం ఆలోచించుకోవాలి. కొత్తవాళ్ళని పెట్టినా పాతవాళ్ళని పెట్టినా ఒకటే యీ రోజుల్లో. కథ బాగుంటే - దర్శకుడు కాస్త శ్రమపడగలిగితే చిత్రం ...రితో తీసినా బాగుంటుంది. బాగా నడుస్తుంది. అర్ధరాత్రి చిత్రంలో భారతి తొలిసారిగా నటించింది. యీ తొలిచిత్రంలో ఆమె యెంతబాగా చేసిందో - దర్శకుడు సాంబశివరావు యెంత శ్రమపడి టేలంట్స్ తెచ్చాడో చిత్రం చూసిన వాళ్ళందరికీ తెలుసు. అందుకు తోడు కథలో బలం జతపడింది. యీ చిత్రం నిర్మాత గంగాధరరావుకు లాభాలు తెస్తుంది. యిలాటి కథ వుంటే దర్శకుడూ నటులూ కొత్తవాళ్ళైనా బాధలేదన్నది తేలింది. బిజీ అయిపోయిన పాతవాళ్ళకోసమే పరుగులుపెట్టి పడిగాపులు పడకుండా నిర్మాతలూ డిస్ట్రిబ్యూటర్సూ కొత్త ముఖాల్ని ప్రతి చిత్రంలోనూ తేవాలి. అది జరగిననాడు ఎప్పుడూ యిలాగే వుంటుంది పరిశ్రమ బోరుకొట్టుకుంటూ - పాతకంపుతో!

* * *

నిర్మాత వై. వి. రావునుంచి వచ్చిన 'టక్కరిదొంగ చక్కనిచుక్క' క్రైయిమ్ చిత్రం యీమధ్య వచ్చిన క్రైయిమ్ చిత్రాల్లో చెప్పుకోదగింది. కథాకథనంలోనూ పాత్రల పోషణలోనూ కొన్ని లోపాలు ప్రతి చిత్రంలోనూ సహజం. అలాటివి కొన్ని తప్పితే చిత్రం ఆద్యంతం మంచి స్పీడుగా సరదాగా సస్పెన్స్‌తో నడిచిందని చెప్పాలి. ఇందులో కృష్ణ శ్యామ్‌గానూ గోపీగానూ ద్విపాత్రాభినయం చేశాడు. మొదటివాడు (శ్యామ్) ఒక దొంగల ముఠాలో వుండి వాళ్ళనే మోసం చేసి వజ్రాలతో పారిపోయినవాడు. రెండో పాత్ర గోపీ, రిక్ష తొక్కుకుని తల్లిని పోషించుకుంటున్న సద్వర్తనుడు. ఇద్దరిదీ ఒకే పోలిక కావడంవల్ల శ్యామ్ గోపీని మాయమాటల్లో పడేసి - తను వున్న యిబ్బందులకూ తన శతృవులకూ అతన్ని గురిచేసి తను తప్పించుకుంటాడు. అటు దొంగల ముఠాలకూ యిటు పోలీసుల వేటకీకూడా గురి అయిన గోపీ కథాంతానికి నిజం నిరూపించి తన్ను తాను రక్షించుకుంటాడు. శ్యామ్ మధ్యలోనే చనిపోతాడు. యీ చక్కని కథను తెరకెక్కించడంలో కథకురాలూ (వసంతి) సంభాషణల రచయితా(మహారధి)ఛాయాగ్రాహకుడూ (ఎస్. ఎస్. లాల్) సంగీత దర్శకుడూ (సత్యం) విశేష ప్రయాసపడ్డారనక తప్పదు. మైసూరు, కేరళలలో తీసిన అవుట్‌డోర్ దృశ్యాలూ - పులితో పోరాటం - యితర ముష్టి యుద్ధాలూ బాగున్నాయి. పోతే దొంగల గుంపులకు పోలీసు ముఠాకివాడినట్టు యూనిఫారాలు వాడడం అంత బాగుండలేదు. క్రైయిమ్ చిత్రమైనా జానపద చిత్రాల పోకడ చాలా వుంది ఆద్యంతమూ - డబ్బుకోసం!!



హాశ్యనటులకు కూడా అదృష్టం కలిసొచ్చింది యిటీవల. వారి ప్రక్కనకూడా తొగరూ తొడలూ వున్న పిల్లలే పడుతున్నారు. సరస్వతీ చిత్రవారి "పంచకళ్యాణి దొంగల రాణి"లో సుంకరలక్ష్మి ఒంపుసొంపుల్ని ప్రత్యేక ప్రదర్శనకు పెట్టాడు మోదుకూరి సత్యం

* * *

యీమధ్య తయారౌతున్న కొన్ని చిత్రాల షూటింగ్స్ రష్ చూస్తుంటే నవ్వొస్తోంది. ఒక యువకుణ్ణి ఒక అమ్మాయి ప్రేమిస్తుంది. అతడూ ప్రేమిస్తాడు. కాని చివరికి ఆ అమ్మాయి వేరే ఒకణ్ణి చేసుకుంటుంది. చేసుకున్న వాడితో గర్భాదానం గదిలో చెబుతుంది - "యీ శరీరం నీది. కావాలంటే వాడుకో. కాని నా మనసు అన్యాక్రాంతం నా దగ్గర లేదు. నీ కివ్వలేను -" అని! డైలాగ్స్ యివి కాకపోవచ్చు - భావం యిదే. ఇలాటి ఘట్టాలు యిప్పుడు తయారౌతున్న నాలుగైదు చిత్రాల్లో వున్నాయి. తర్వాత తొలి ప్రియుడు తారసపడే ఘట్టంకూడా ఒకటి మరో చిత్రంలో వుంది. ఇద్దరూ కనిపించగానే కౌగలించేసుకుంటారు! తర్వాత ఏం చెయ్యాలి అన్నది ప్రశ్న! చంపెయ్యాలి అంటాడు నిర్మాత! చంపేస్తే మాత్రం అంత పాపం చేశాక సింపతీ వస్తుందా పాత్రమీద? అంటాడు కథకుడు! ఇలా వున్నాయి మన కథలు! ఇందులో మహా మహాగా చెప్పుకోబడుతున్న కాస్ట్యూమ్ చిత్రాలుకూడా వున్నాయి కొన్ని! ఏ ఆడదైనా పెళ్ళి అయిన తర్వాత భర్తకు తన గతం స్ఫురింపజేస్తుందా? చెయ్యవచ్చునా! అన్న సెంటిమెంటల్ పాయింట్స్‌కు దూరంగా "యిదే విజ్ఞానం- యిదే సందేశం-" అన్నట్టు వస్తున్న యీ చిత్రాల్ని ప్రజలు ఎలా ఆదరిస్తారో చూడాలి!

* * *

పత్రికలు లేవదీసిన రభసతో - రట్టు అయిపోతామన్న భయాలవల్ల మళ్ళీ మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకునే రద్దీ కొంచెం తగ్గిందిప్పుడు పరిశ్రమలో. ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళు చేసుకోకుండా మధ్యలో యీ పత్రిక లేమిటి? అన్న బాధకూడా అక్కడక్కడ బయలుదేరిందని వార్తలు. ఒకతార పెళ్ళాడబోయిన పెళ్ళయిన వరుడు "నాకు పెళ్ళొద్దు బాబో" అని చేతులెత్తి దండం పెట్టేశాడట ఆమెకు. "లోకాన్ని చూసి భయపడితే మరీ భయపెడుతుంది లోకం అందుచేత భయపడకూడదు!" అని ఆవిడ ఎంత బోధించినా వినలేదట ఆల్‌రెడీ పెళ్ళయిన ఆ వరుడు! "ఏమమ్మా - ఏమిటి ఫలానా మూడు పెళ్ళిళ్ళయిన పెద్దను పెళ్ళాడుతున్నావటగా?" అని ఒకతారను అడిగితే - "శుద్ధ అబద్ధం సాక్ - యిప్పుడలాటి ఉద్దేశం ఏమీలేదు" అని ఖండించి పారేసింది నీటుగా మరోతార. బాగుంది వాతావరణం. ఎక్కడ ఏం జరిగినా "చేసుకుంటున్నాం" అంటూ ఎవరూ రావడంలేదిప్పుడు. కాని పత్రికలమీద ఇలాటివాళ్ళకు కొందరికి చాలా బాధగానూ కోపంగానూ వుండడం సహజం. నిజం వ్రాయడం నిష్ఠూరమే కదూ!

★



ఫిలిమ్ న్యూస్

కాకినాడలో శ్రీమతి విజయనిర్మల అభిమానసంఘం ఒకటి ఏర్పడింది. అతి త్వరలో తళుకు తళుక్కుమని మెరసిన యీ తారకు విశాలాంధ్ర అంతటా యిలాటి అభిమానసంఘాలు ఏర్పడబోతున్నాయట, కాకినాడలో యీమె అభిమానసంఘం స్థాపన మే 4వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగింది. వల్లభాయి వీధిలోని రాజీవ్ అండ్ కోలో యీ ప్రారంభోత్సవం అతివైభవంగా జరుపుకున్నారు అభిమానులు.

* * *

ఆంధ్రదేశంలోని అనేక ప్రాంతాలలో సెక్సుతార జ్యోతిలక్ష్మి అభిమానసంఘాలు కూడా ఏర్పడుతున్నట్టు ఏర్పరచనున్నట్లూ వార్తలు. అభిమాన సంఘాలు ఏర్పడ్డ ఆడతారలు యింతవరకూ తెలుగు తెరమీద విజయనిర్మలా జ్యోతిలక్ష్మి మాత్రమే''. నటుడు శ్రీ జగ్గయ్యపేర కూడా అభిమాన సంఘాల్ని ఏర్పరుస్తున్నట్టు సలహాలు యివ్వమనీ కొంతమంది కొన్ని పట్టణాలనుంచి వ్రాస్తున్నారు. త్వరలోనే యివి కూడా ప్రారంభమౌతాయి.

* * *

జయా పిక్చర్స్‌వారు శ్రీ కె. రాధాకృష్ణ దర్శకత్వంలో మొదలుపెట్టిన సాంఘికానికి ఏప్రిల్ 27 న ప్రారంభోత్సవం జరిగింది. యీ చిత్రానికి ''నా దేశం'' అని పేరుపెట్టారు. వాసూ స్టూడియోలో షూటింగుతో ప్రారంభోత్సవం జరిగిన యీ చిత్రంలో హరనాథ్ ముక్కామల ప్రభాకరరెడ్డి ధూళిపాళ వి. శివరాం త్యాగరాజు నల్ల రామ్మూర్తి అల్లు రామలింగయ్య సత్యనారాయణ షావుకారు జానకి కాంచన మాలతి విజయలలిత సుజాత వగైరా నటిస్తున్నారు. నిర్మాత శ్రీ ఎ. మాధవరావు. నిర్వహణ శ్రీ వీరాచారి.

* * *

జయలక్ష్మి ఆర్ట్సు అనే నూతనసంస్థ మేనెల నుంచి తమ చిత్రానికి షూటింగు ప్రారంభిస్తున్నారు. నిర్మాత ఆంధ్ర మంత్రి శ్రీ రామలింగరాజుకు దగ్గర బంధువైన శ్రీ కె. వెంకట్రామరాజు. శ్రీ ఆదుర్తి సుబ్బారావువద్ద ఎంతో కాలంగా అసోసియేట్‌గా పనిచేస్తున్న శ్రీ స్వామి (మాధవరావు) యీ చిత్రానికి దర్శకులుగా ఎన్నుకోబడ్డారు. కృష్ణ కృష్ణంరాజు విజయనిర్మల విజయలలిత జ్యోతిలక్ష్మి రాజుబాబు సూర్యకాంతం సాక్షి రంగారావు వగైరా నటిస్తున్న యీ చిత్రానికి మాటలు ఆత్రేయ వ్రాస్తున్నారు. కెమెరా యం. కె. రాజు. సంగీతం మహాదేవన్. నృత్యం హీరాలాల్. స్టూడియో ప్రసాద్ స్టూడియో.

* * *


అన్నపూర్ణా మధుసూధనరావు ఆధ్వర్యంలో తయారైన సారధీవారి ''ఆత్మీయులు'' విడుదలకు సిద్ధమౌతోంది. నాగేశ్వరరావు వాణిశ్రీ విజయనిర్మల వగైరా నటించారు యిందులో. మే పదవతేదీని శ్రీ మధుసూధనరావు కుమార్తె పెళ్ళిసందడి పూర్తిఅయిన వెంటనే ఆయన అన్నపూర్ణా చిత్రాన్ని ప్రారంభిస్తున్నారు. కథ మాటలు శ్రీ డి. వి. నరసరాజు వ్రాస్తున్నారు. ఇందులో నాగేశ్వరరావు జయలలిత నటిస్తారు.

* * *


శ్రీ గిడుతూరి సూర్యం, ఎన్. వెంకట్రావు నిర్మిస్తున్న జానపదచిత్రం ''పంచకళ్యాణి దొంగలరాణి ' పూర్తికావచ్చింది. ఈ నెలాఖరుకు విడుదల ఎప్పుడైనా చేసుకోమని డిస్ట్రిబ్యూటర్స్ పూర్ణావారికి అప్పజెబుతున్నారు కూడా. కాంతారావు విజయలలిత కృష్ణంరాజు సంపత్ కుమార్ అర్జా జనార్ధనరావు బలిరెడ్డి సుబ్బారావు జయకృష్ణ రాజుబాబు వగైరా అనేకమంది తారాగణం వున్నారిందులో. మధుమతి (సుధామాల) ఒక ప్రాముఖ్యత గల పాత్రధారణ చేసింది యీ చిత్రంలో. చిత్రం విజయవంతం కావడానికి దర్శకులు శ్రీ గిడుతూరి విశేషకృషి చేశారని వార్తలు. రెంటాల మాటలూ కరుణశ్రీ పాటలూ ప్రత్యేకతలు యీ చిత్రంలో.

* * *

శ్రీమతి అంజలి, ఆదినారాయణరావులు చిన్ని బ్రదర్స్‌పేరిట నిర్మిస్తున్న సాంఘికం షూటింగ్ మే నెల మొదటి పది రోజులూ పాపికొండలవద్దనూ దేవీపట్నంలోనూ జరిగింది. మే చివరి వారంలో కొంత కోనసీమలో జరుగుతుంది. ఆ షెడ్యూలుతో యీ చిత్రం సగం పూర్తి అవుతుందట. శ్రీ ప్రత్యగాత్మ పర్యవేక్షణలో తయారౌతున్న యీ చిత్రానికి దర్శకుడు శ్రీ ప్రసాద్ (సింహాచలక్షేత్రమహిమ దర్శకుడు). తారాగణం కృష్ణ, కృష్ణంరాజు, విజయనిర్మల, విజయలలిత, శ్రీమతి అంజలీదేవి, గుమ్మడి వగైరా. సంగీతం ఆదినారాయణరావు; విడుదల లక్ష్మీఫిలిమ్స్. *



మరపురాని మానవతా వాది మా నాగేశ్వర్రావు



తెలుగు ఫిలింపరిశ్రమను హైదరాబాద్ కు మళ్ళించిన అపర భగీరధుడు. తను ఎక్కడుంటే అక్కడేవుంటాయి సంచలనమూ విజయమూ కూడా అని నిరూపించుకున్నాడు.

శ్రీ అక్కినేని నాగేశ్వర్రావుతో నాకున్న పరిచయమూ చనువూ దాదాపు దేవదాసునుంచీ. అప్పట్నుంచీ కిందా మీదా పడుతూనేవున్నాం జర్నలిస్టుగా నేనూ బాధ్యతగల నటుడుగా ఆయనా.

బహుశా తెలుగు సినిమా పరిశ్రమ పుట్టిన తర్వాత యింతవరకూ పత్రికల్లో అంత ఘాటైన విమర్శల్నీ ప్రతిఘటనల్నీ ఎదుర్కున్న నటుడు మరొకరు లేరేమో!

ప్రతిసందర్భంలోనూ నా ఘాటైన విమర్శలకు ఎంతనీటుగా నవ్వేవాడో-అవసరమైతే మంచిచెడ్డా వివరించి చెప్పేవాడో చెప్పడానికి సాధ్యంకానంత గొప్ప విషయం.

పొగడ్తను కాకుండా పొగడ్తలో సత్యం వుంటే దాన్ని ఎంత తియ్యగా స్వీకరించి ఆనందిస్తాడో చెప్పాలంటే కూడా ఆయనకాయనే సాటి!

"యీ సెంటెన్స్ చాలా బాగుంది. నన్నర్థం చేసుకున్న వాక్యం యిది [illegible] ఆయన స్వయంగా అన్నప్పుడు రచయితకెంత తృప్తి!

అలాగే విమర్శించినప్పుడూ—

"ఏదో రాస్తూ వుంటారు. ఏదీ రాయకపోతే యెలా! పేపరు అమ్మద్దూ!" —అంటాడు నవ్వుతూ—

విమర్శలో విషయం వున్నప్పుడు మరోలా చెబుతాడు—

"మీరు రాసింది కరక్టే. అది మీ అభిప్రాయం. మీకు తెలిసింది. నేనైతే ఏకీభవించను నాకూ ఒక అభిప్రాయం వుంది. తెలిసింది వుంది. నన్నుకూడా మీరు తీసుకోవాలి—" అని.

విమర్శకులమీద కత్తులు దుయ్యడం-పొగిడేవాళ్ళని చుట్టూ కూర్చోపెట్టుకుని అదే లోకం-నేనే రాజుని అనుకోవడం యీ రెండూకూడా లేవు ఆయనలో.

విమర్శల్లోగాని పొగడ్తల్లోగాని ఒక్కొక్కప్పుడు యదార్థం లోపించినా ఆనందిస్తాడు-ఆ భాష పసందుగా వుంటే.

—"బాగుంది. విమర్శతో ఏకీభవించడం పొగడ్తకు ఆనందించడం రెండూ లేవుగాని భాష బాగుంది. మంచి ట్విస్టు వుంది. అలా చెప్పడం అందరికీ చేతకాదు—" అని అప్రిసియేట్ చేస్తాడు.

చేస్తాడు అంటే అదిగో నన్ను "డు" అంటావే - నకు బుద్ధిలేదు. [illegible] తెలుసా? అని కరవడు.

పెద్దవాళ్ళనీ గొప్పవాళ్ళనీ అప్యాయతా ఆత్మీయతా గలవాళ్ళనీ - "డు" - అనే సంబోధిస్తాం. అది అలవాటు. నిజంగా గొప్పవాళ్ళకి "డు" ఉపయోగిస్తాంకూడా. నేనూ గొప్పవాణ్ణే అనుకున్నారు గనుక అలా అన్నారు తప్పేమిటి? అని సమర్ధిస్తాడు - సమర్ధించుకుంటాడు.

పత్రికల్లో విమర్శలు లేకుండా సలహాలు లేకుండా కేవలం కాకాతో చప్పు చప్పుగా వస్తుంటే కూడా సహించలేని వ్యక్తి నాగేశ్వర్రావు. తనని గురించి యేంరాశారో చూసుకుని మురిసిపోవడం కంటె - పత్రికకు పాఠకుడుగా ఫీలయి విషయాన్ని తీసుకుంటాడు

కాగడా ఒకప్పుడు చప్పగా వచ్చింది- కేవలం పొగడ్తలతో. ఆయనమీదకూడా యేవో పొగిడాను సందర్భంవస్తే "—చప్పుగా చప్పగావుంది పత్రిక. కాగడా అలావుంటే నచ్చదు నాకు. ఎప్పుడూ బుస్సు బుస్సుమంటూ బుసలుగొట్టే నాగుబాము ఒకనాడు చాలు చప్పగా చప్పుగా పడుంటే - నలుగురూ నాలుగురాళ్ళూ వేస్తారు! మీరు మారకూడదు. మారితే చదవరు జనం" - అని ప్రోత్సహిస్తాడు.

ఇంత సంస్కారం పత్రికల విషయంలో పాఠకులకుంటుంది. నాగేశ్వర్రావుకుంది. అతడు మహానటుడేకాదు- పత్రికలకు సామాన్య పాఠకుడు కూడా.

ఘాటు ముదిరినా పొగడ్త ముదిరినా అంటూవుంటాడు — ఒకసారి డైరీలో వ్రాసుకున్నాడుకూడా సుభాషితం ఒకటి.

(తరువాయి 14 వ పేజీ)


నటుడు నియంత కారాదు

....ఒక స్థాయికి చేరుకున్న తరువాత మరో ప్రధానమైన సమస్య నటుడికి ఎదురౌతుంది. పరిశ్రమ బాగోగులకు సంబంధించిన బాధ్యత నటుడిపై పడుతుంది. జీవితంలో పొందిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని క్షీర నీర న్యాయానుసారంగా వర్తించుకోవలసిన బాధ్యత వుంటుంది మొదట ప్రజలపట్ల తర్వాత కళపట్ల తనకుగల ధర్మాన్ని నిర్వహించిన మీదటనే పరిశ్రమపట్ల తనకుగల బాధ్యతను నిర్వహించవలసివుంటుంది కాని అప్పుడుకూడా పరిశ్రమను శాసించే అధికారం అతనికిరాదని నా దృఢనమ్మకం. తన అనుభవాన్నిబట్టి తనకు తోచిన సలహాలను మాత్రమే యివ్వవచ్చు. కాని పరిశ్రమ అంతా తనపై ఆధారపడివుంది గాబట్టి తన యిష్టానుసారం పరిశ్రమ నడుచుకోవాలన్న భావం సముచితం కాదు. ఎంత ఉన్నతస్థాయికి చేరుకున్నప్పటికీ తాను పరిశ్రమలో ఒక అంశాన్ని మాత్రమే అన్నవిషయం మరచిపోకూడదు. ఏ పరిశ్రమైనా ఏ సంస్థ అయినా ఒకే ఒక వ్యక్తిపై ఆధారపడి వుండదు. వ్యక్తులు యివేళ వుంటారు. రేపు వుండకపోవచ్చు. కాని పరిశ్రమ పురోగమిస్తూనే వుంటుంది—.

(1-5-'69 "వెండితెర" లో శ్రీ నాగేశ్వర్రావు.)



వరద గోదావరిలా కట్లూ గట్లూ త్రెంచుకుని పొంగుతోంది విజయలలిత పి. ఎ. పి. వారి 'ఆదర్శకుటుంబం'లో. యెంత యెత్తున విజృంభించిందో చూడగలరు ప్రేక్షకులు.


తప్పక చూడండి
రవిచిత్ర ఫిలిమ్స్
టక్కరిదొంగ
చక్కని చుక్క
నిర్మాత: వై.వి.రావ్
దర్శకత్వం: కె.యస్.ఆర్.దాస్
పూర్ణా
రిలీజ్

వార్తలు

వేసవికాలం - ఆరు బయళ్ళు - పాల వెన్నెల్లు - మల్లెపువ్వులు మహా యిదిగా వుంది ప్రకృతి. అదను చూసుకుని పెళ్ళిళ్ళు చేసేసుకుంటున్నారు అర్జంటుగా చాలామంది. అన్ని విధాలా సుఖపడమని ఆశీర్వదిస్తూ ఆ లిష్టు మాకందినంతవరకూ యీ క్రింద ప్రచురిస్తున్నాం - కాగడాకు చెందిన ముఖ్యులు కాబట్టి.

★ అన్నపూర్ణాసంస్థ అధినేత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావుగారు తమ మూడవ కుమార్తె చి॥ సౌ॥ లక్ష్మీకాంతను విజయవాడ వాస్తవ్యులు శ్రీ తుమ్మల లక్ష్మణ స్వామిగారి రెండవ కుమారుడు చి॥ జవహర్లాల్ యం. బి. బి. ఎస్.కు యిచ్చి మే 10 వ తేదీ ఉదయం సుమారు 10 గంటలకు హైదరాబాద్‌లో వైభవంగా వివాహం జరిపారు. పరిశ్రమలోని అనేక శాఖలకు చెందినవారూ ప్రభుత్వ - రాజకీయ రంగాల్లోని ఎంతోమంది ప్రముఖులూ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వైణికశిఖామణి శ్రీ చిట్టిబాబు పార్టీ వీణ కచేరీ - విందుభోజనం పసందుగా సమకూర్చబడ్డాయి ఆహూతులకు.

★ యన్. వి. కె. ఆర్. పబ్లిసిటీ సంస్థ (విజయవాడ) అధినేత శ్రీ నిమ్మగడ్డ వెంకటకృష్ణారావుగారు తమ ఆరవ కుమారుడు చి॥ లలితాప్రసాద్ బి.కామ్.కు రేపల్లె వాస్తవ్యులు చెలసాని పరంధామయ్యగారి అయిదవకుమార్తె చి॥ సౌ॥ నిర్మలాదేవి యం. ఎస్. సి. (ఫైనల్)ను యిచ్చి కృష్ణాజిల్లా రేపల్లెలో ఏప్రిల్ 30 వ తేదీ ఉదయం సుమారు 10 గంటలకు వివాహమహోత్సవం జరిపించారు. ఫిలిం పరిశ్రమలోని అనేకమంది ప్రముఖులు స్వయంగా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

★ ప్రముఖ నిర్మాతదర్శకులు శ్రీ బి. విఠలాచార్య తన కుమారుడూ దర్శకుడూ అయిన చి॥ శ్రీనివాస్‌కు మద్రాసు వాస్తవ్యులు శ్రీ పి. జనార్దనరావుగారి ప్రథమ పుత్రిక చి॥ సౌ॥ లలితను యిచ్చి మే 5 వ తేదీ ఉదయం సుమారు 10 గంటలకు మద్రాసులో ఘనంగా పెళ్ళి జరిపించారు. 8 వ తేదీ సాయంత్రం ఆహూతులకు ప్రత్యేకమైన విందూ - కుమారి రత్నపాప కుమారి సీతల నృత్యం ఏర్పాటు చేయబడ్డాయి. పరిశ్రమ కొక పండుగగా వైభవంగా కల కలలాడింది పెళ్ళిపందిరి.

★ ఇటీవలే చర చరా పైకి వచ్చిన నటుడు కృష్ణంరాజు రాజ్‌బహదూర్ అనే గాంధీబాబుగారి కుమార్తె చి॥ సౌ॥ సీతాదేవిని మే 10 వ తేదీ ఉదయం సుమారు 10 గంటలకు పశ్చిమ గోదావరిజిల్లా మొగల్తుర్రు కోటలో అనేకానేకమంది అభిమానులూ మిత్రులు ఆశీర్వదించగా వివాహం జరుపుకున్నారు.

★ సుమారు ఆరడుగుల విలన్ నటుడు శ్రీ ఆనందమోహన్‌కు ఏప్రిల్ 23 న కంచికచర్లలో వివాహం జరిగింది. వధువు శ్రీ డి. జానకిరామయ్యగారి కుమార్తె చి॥ సౌ॥ పద్మావతి. పరిశ్రమలోని ముఖ్యులూ మిత్రులూ వేడుకలో పాల్గొన్నారు. పెళ్ళిపందిరి ఎత్తు తక్కువ కావడంవల్లా, మంచం మంచి బలమైనది కాకపోవడంవల్లా సరదాకి సంబంధించిన చిన్న చిన్న చిలిపిసంగతులు వినబడ్డాయి తప్పితే నూటికి నూరు పాళ్ళూ వధూవరులు వేసవికాలాన్ని పూర్తిగా అనుభవించారనే వార్తలు!

★ ప్రఖ్యాత రచయితలూ సెక్సు పత్రికల సంపాదకులూ(రసికప్రియ, మన్మధ) అయిన శ్రీ డా॥ మల్లిఖార్జనరావు శ్రీ విశ్వప్రసాద్‌లు తమ బావమరది శ్రీ యన్. పి. రాజేశ్వరరావుకు చి॥ సౌ॥ మల్లికాంబతో (శ్రీ యల్. మల్లయలింగం గారి కుమార్తె) వివాహం జరిపించారు యిటీవల. సెక్సు పత్రికలకు చెందిన స్వాములు కాబట్టి రసికతలు మహా జోరుగా ముందడుగు వేస్తున్నా యని అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నారు అభిమానులు.

★ హైదరాబాద్ నుంచి వచ్చే 'వెండితెర' సంపాదకులు శ్రీ బి. ఎ. వి. శాండిల్య మే 4 వ తేదీని వివాహం చేసుకున్నారు. వధువు చి॥ సౌ॥ రాజరాజేశ్వరి. వివాహం తెనాలిలో జరిగింది. యీ పెళ్ళి సహజంగా వేసవికాలంలో పత్రికా సంపాదకులకుండే 'బిజీ' సీరసాన్ని కొంత తేలిక పరుస్తుందనడం ఖాయం! ★

......శ్రీ నాగేశ్వర్రావు

(4 వ పేజీ తరువాయి)

''వేలికి గోరు రక్ష. అది పెరిగితే వేలికే ముప్పు. జర్నలిజం కూడా అలాటిదే. ఏదీ శృతిమించకూడదు. అలాగే నటీనటులు కూడా. శృతిమించేలా చేసుకోకూడదు—'' అని! ఎంత తాత్విక వేత్త! ఎంత సాత్వికవాది!

తరచు కనిపించే స్నేహితుడు పదిరోజులు వరసగా కనిపించకపోతే ఆరాటపడిపోతాడు. ఆవేశపడిపోతాడు. అతడు జర్నలిష్టయినా అంతే. కళాకారుడైనా అంతే. నిర్మాతలైనా అంతే.

''ఏమిటెక్కడా కనిపించడంలేదు స్వామీ'' అని బాధపడతాడు పదిరోజులు కనిపించకపోతే—

నెల్లాళ్ళు కనిపించకపోతే - ''కులాసాగానే వున్నాను మీ దయవల్ల. చాలా కాలానికి జ్ఞాపకం వచ్చానే!'' అని వ్యంగ్యోక్తులు విసురుతాడు.

కబురుచేసినా వెళ్ళకుండా- ఆ తర్వాత ఎప్పుడో వెడితే - గట్టిగా అరుస్తాడు సర్వెంటును పిలుస్తూ.

''దండలు పట్రా! శర్మగారు వచ్చారు! వేద్దాం!'' అని.

ఎంత సంతోషంగా వుంటుంది - ఎంత ఆనందంగా వుంటుంది స్నేహితులకు ఆ అప్యాయత చూస్తే!

దేనికి యిదంతా? ఏమైనా స్వార్థం వుందా?

ఏమీలేదు - ఏమీకాదు-ఏదీ వుండదు. ఎవరితోనూ అవసరాలులేని వాళ్ళలో - అందరికీ తనవసరం మాత్రమే వుండే వాళ్ళలోఆయన ప్రథముడు!కాని ఆఅప్యాయత అలాటిది! ఆ గురి అంతటిది! విమర్శించివెళ్ళినా పొగిడివెళ్ళినా ఆయనతో అరగంట కూర్చుంటే - మందు కొట్టి మదవతిని పొందినంత తృప్తిగా తేలిగ్గా వుంటుంది!

విమర్శల్నిగురించీ విమర్శకులగురించీ అప్పుడప్పు డాయన కొన్ని సలహాలిస్తూ వుంటాడు కొన్ని కొన్ని సందర్భాలు చూస్తున్నప్పుడు.

''స్పృహలోవున్నవాణ్ణి విమర్శించండి తీసుకుంటాడు. స్పృహతప్పిన వాణ్ణి మీరు ఎన్ని అన్నా ఎక్కువ. బట్టకట్టుకున్నవాణ్ణే ఏమైనా అనండి. తిట్టండి. సలహా చెప్పండి. బట్టలూడదీసుకుని బజార్లో గంతులువేసే పిచ్చివాళ్ళకేం చెప్పగలరు? పైగా పిచ్చివాళ్ళతో ప్రమాదం. తను బట్టలు విప్పుకున్నానని తనకు తెలియకపోగా - కట్టుకో నాయనా అని మనం చెప్పబోతే కొట్టడానికి వస్తాడు!''

కాగా విమర్శించే వాడికెంత పాత్రత వుంటే విమర్శిస్తాడో - విమర్శించబడే వాళ్ళకికూడా అంత అర్హత వుండాలంటాడు నాగేశ్వర్రావు! ఎంతటి లోకజ్ఞానమో అది! ఎప్పుడు నేర్చుకున్నాడో- ఎన్నడు అలవర్చుకున్నాడో!

ఇంతకాలం జర్నలిజంలో ప్రథమ శ్రేణిలో బ్రతుకుతున్నాననుకుంటున్న నా కళ్ళే తెరిపిస్తూ వుంటాడాయన అప్పుడప్పుడు యిలాటి చెణుకులతో - సుభాషితాలతో!

నా అభివృద్ధిలో - నేనింతవాణ్ణి కావడంలో భాగం మీ అందరికీ (పత్రికలకు) కూడా వుంది. అది ఎప్పుటూ 'డినై' చెయ్యలేను -అంటారాయన ఎక్కడ కనబడ్డా జర్నలిష్టును తనలోంచి ప్రతిబింబిస్తూ. ఇలా చెప్పుకునే - చెప్పుకుంటున్న కళాకారుడు బహుశా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఒకే ఒక్క నాగేశ్వర్రావేమో. ఆయన తిన్నయింటి వాసాలు లెక్కపెట్టలేదు! ఈ అసమర్ధతను కూడా ఆయన గర్వంగానే తీసుకుంటాడు!

తల్లి - భార్య - నిర్మాతలు - సాంకేతికులు - పత్రికలు - ఏదీ మరచిపోలేదు ఆయన. అడుగడుగునా స్మరిస్తూనే వుంటాడు. తర్కిస్తూనే వుంటాడు. ఇంతమందిపట్ల గల కృతజ్ఞతతో ఎంత సతమతమైపోతున్నాడో సదా!-నిరంతర కృషి నిత్యసంతోషంలో తెలుస్తూనే వుంటుంది?

శ్రీ నాగేశ్వర్రావుకు పత్రికాలోకంలో ఒక అమూల్యస్థానం వుంది. పాత్రికేయుల హృదయాల్లో ఆయనకు శాశ్వత స్థానం వుంటుంది. పాత్రికేయుల్ని ఆయన మరచిపోరు - పోలేరు. అలాగే ఆయన్ను కూడా మరచిపోలేరు పాత్రికేయులు. తర్డుఫారం చదువుకున్న వ్యక్తికెక్కడనుంచి ఏ జన్మాంతర సుకృతం లోంచి వచ్చిందో యింత వివేకమూ విజ్ఞానమూ! చదువులెందుకు! ఆ సుకృతం గావాలిగానీ!

రజతోత్సవ సందర్భంగా కాగడా కాగడాశర్మా ఆ మహనీయుడికి - మహామనీషికి తమ ప్రేమపూర్వక శుభాభినందనలు తెలుపడం శతథా విద్యుక్తధర్మం. విజయోస్తు!

— కాగడా శర్మ

ఇంటర్వ్యూ

(5 వ పేజీ తరువాయి)

''కృష్ణను కాదనుకుని - నిజాయితీగా భర్తను అంటిపెట్టుకునివుండి సవరించుకోవచ్చును గదా ఆ తప్పు?''

''నా ఉద్దేశంలో అది. మరో తప్పవుతుంది—''

''ఎలా?''

''భర్తవుండగా మరొకరితో తప్పు చేశాను. అది కృష్ణతో. మళ్ళీ కృష్ణను కాదనుకుని భర్తతో వుండిపోతే అది రైటుకాదు.జీవితంలో ఆ భర్తకు అశాంతి తప్ప మరేదీవుండదు. నాకూ మనస్సాక్షి సుందరంగా అందంగా వుండదు—''

''గొప్ప తాత్వికురాలవే. మీ ఆర్గుమెంటుకు సంతోషిస్తున్నాను. కాని యిక్కడే మరో ప్రశ్నకూడా! ఏమీ అనుకోనంటే.....!''—

''అనుకోను. అడగండి. ఏమిటది?''

''ఒక్క కృష్ణతోతప్ప మరెప్పుడూ మరెవరితోనూ తప్పులు చెయ్యలేదా మీరు - రహస్యంగా కూడా?''—

''లేదు—''

''ఎలా నమ్మేది?''

''మానెయ్యండి. కాని అది నా ఆత్మసాక్షి!''

''నేనుకాదు నమ్మనిది. లోకం—''

''లోకాన్ని నమ్మించగల శక్తి నాకు లేదు. కాని నన్నెరిగి - నాకు సన్నిహితులైన వాళ్ళైనా - అంటే మీలాటి వారు - నమ్మగలిగితే చాలు!''—

''—ఇంతకీ యిప్పుడు మీ అసలు భర్తమీద మీ అభిప్రాయం?—''

''ఆయన దేవుడు—''

''కృష్ణమీద—''

''ఆయన నా హృదయంలో దేవుడు—''

''మీ అబ్బాయి?—''

''మా అబ్బాయి-అందరూ అనుకుంటున్నట్టుగా నాకు దూరంగా లేదు. తల్లీ బిడ్డా వేరుకారు. ఆ బాంధవ్యం రక్తంలో వుంది. ఎక్కడికి పోతుంది—?''

''సో - యు ఆర్ ఆల్‌రైట్! విష్ యు హేపీ! వస్తాను—''

''మీరు మాట్లాడుతుంటే ఎంతో బాగుంటుంది. వస్తూవుంటే సంతోషిస్తాను.'' ★

ఎడిటర్స్ మెయిల్

[ఎవర్నీ నొప్పించడం మా అభిమతం కాదు. రంజనకూ సమాచారానికీ మాత్రమే.
ఎడిటర్]

పుట్టా రాజేశం, పెద్దపల్లి.

ప్ర: స్త్రీ పురుషుణ్ణి అడిగితే లొంగిపోతాడు. పురుషుడే స్త్రీని అడిగితే చెంప ఛెళ్ళుమనిపిస్తుంది. ఏమిటీ తేడా?

జ: స్త్రీకి సహజంగా సిగ్గెక్కువ. ప్రతిష్ట ముఖ్యం — కోరిక వున్నాసరే.— పురుషుడు అలా కాదు వచ్చినా రాక పోయినా అతడికొచ్చిన నష్టం వుండదు.

యి. బాలకృష్ణ. అక్కుపల్లి.

ప్ర: "కథానాయకుడు" లో నాగభూషణం కళ్ళజోడు జయలలిత తీసేస్తే కళ్ళు కనిపించనట్టు నటిస్తాడు మరి ఆఖరు రీలులో కళ్ళజోడు లేకుండానే నటించే స్తాడేమండి?

జ: ఆఖరు రీలుదాకా జ్ఞావకం వుంటాయా యిలాటి చిన్నచిన్న విషయాలు. మీరు మరీను!!

: విజయనిర్మల కృష్ణ పెళ్ళివిషయంలో పరిశ్రమ ఏమనుకుంటోంది?

జ: వాళ్ళకి యింకో పదిపిక్చర్లు యిచ్చింది!

ఎస్. ఆర్. అవధాని, తణుకు.

: ఇంత అందమైన ప్రపంచాన్ని చూడ్డానికి దేవుడు రెండేరెండు కళ్ళుయిచ్చాడేమిటి?

జ: రెండుకళ్ళిస్తేనే అతణ్ణి మరచిపోయి విశృంఖలంగా విహరిస్తున్నాం మనం. మరో రెండిస్తే అతడెక్కడున్నాడని వెతికి పట్టుకుని చితగ్గొట్టడానికి వెళ్ళం? మన సంగతి అతగాడికి బాగా తెలుసు!

ప్ర: "రహస్యం"లో శంకరరెడ్డికి ఏం మిగిలింది?

జ: అప్పు!

ప్ర: మన తెలుగువారిలో మంచి నర్తకి యెవరు మీ అభిప్రాయంలో?

జ: జ్యోతిలక్ష్మి. మన నిర్మాతలు కేవలం తొడలమీదే కాన్‌సెన్‌ట్రేట్ చేసి ఆ కళా సరస్వతిని వీధిని పడేశారు!

ప్ర: కాగడాశర్మ అభిమానసంఘం నెలకొల్పాలనుకుంటున్నాము. మీ ఆమోదం కావాలి?

జ: ప్రజల్లో యింత అపూర్వ సంస్కారమా?—కృతజ్ఞుడను. కాని నయాపైసాకూడా పెట్టలేను పెట్టుబడి. క్షమించాలి.

ప్ర: కాంతారావు తను గోల్డెన్ స్టూడియోలో పనిచెయ్యనని చిన్న నిర్మాతల్ని మాత్రమే యిబ్బంది పెట్టడంలో ఉద్దేశం?

జ: పెద్ద నిర్మాతలెవరూ అంతగా తనకు లేరుగనుక!

జి శాంతయ్య, భువనగిరి.

ప్ర: నటీమణుల్ని యెక్కువగా టైట్ డ్రెస్‌లోనే చూపుతారెందుకు నిర్మాతలు? చీర కట్టిస్తే సెక్సు కనిపించదా?

జ: ఆడదాని ఒంటిమీద అసలు బట్టంటూ వుంటే ఒప్పుకోరు మందుకొట్టేటప్పుడు కొంతమంది మన (సినిమా) వాళ్ళు ఆమాత్రం ఏదో ఒకటి టైట్‌గానో లూజుగానో వేస్తున్నారు సెన్సారుకోసమైనా! సంతోషించండి!

యస్. ప్రభాకరరావు, హన్మకొండ.

ప్ర: నాకు జయలలితను పెళ్ళాడాలని వుంది. నెరవేరుతుందా నా కోరిక?

జ: వేరదు—పది పదిహేనుముంది పెద్ద వాళ్ళకే వుందిక్కడ ఆ కోరిక! మీదాకా రాదు "క్యూ!"

ప్ర: ఎడిటర్‌జీ! మీ జీవితంలో మరపురాని ఘట్టం ఒకటి చెబుతారా?

జ: కాగడా జయప్రకాష్ అశోక్ మెహతాల ఆశీర్వచనంతో స్టార్టు అయింది 14 ఏళ్ళకు ముందు! ఆ రోజు మరచిపోను—నేటి పరిస్థితుల్నీ మనుషుల్నీ చూస్తుంటే మరీ జ్ఞాపకం వస్తోంది!

కె. భూమయ్య, బర్దిపూర్.

ప్ర: "బొమ్మలు చెప్పిన కథ"లో కాంతారావు కృష్ణలలో యెవరు బాగా చేశారంటారు?

జ: కాంతారావు వున్నాడా అందులో!

టి. కోటేశ్వర్రావు, మద్రాసు.

ప్ర: కీ॥ శే॥ ప్రెసిడెంట్ జకీర్ హుస్సేన్ పై మీ అభిప్రాయం?

జ: సర్వోత్తముడు-యెప్పటి సంతకాలు అప్పుడు అడిగీ అడగ్గానే ఏ ప్రశ్నలూ ఆలోచనలూ లేకుండా పెట్టేసేవాడు!

ప్ర: విజయనిర్మల మీకు "రెండు చపాతీలు" పెట్టిందని ఆశీర్వదించేస్తున్నారు. అంతేనా?

జ: ఛా! ఛా! అంతేనా! తర్వాత మళ్ళీ పెట్టింది గార్లూ పులిహోరా పరమాన్నం అన్నీ కూడా! "ఇది కూడా రాస్తారా పత్రికలో?" అనికూడా అడిగింది!

ప్ర: సర్దార్‌పటేల్ బ్రతికుంటే?

జ: రాజ్యాలూ రాజులూ పోయి యీ "ఎస్టేట్"లు అవతరించివుండేవి కావు! రాజ్యాలేలిన రాజులే మెరుగనిపిస్తున్నారు యిప్పటి మోతుబరి రౌడీలను చూస్తుంటే!

ప్ర: హరనాథ్ యెంత సంపాదించాడు?

జ: అతడికేం! బాగా సంపాదించాడు. ఇంక ఒక్క పదివేలు మాత్రమే వుంటుంది అప్పు!

ప్ర: ఆనందం యెలా లభిస్తుంది....?

జ: అనుభవిస్తే!

ప్ర: మీరు ఓ కారు కొనుక్కోకూడదూ?

జ: ఏం లాభం! "షి"-లేనప్పుడు కారెందుకు! ప్రస్తుతానికి సుఖంగానే పని జరిగిపోతోంది అద్దె బళ్ళతో!

యం. పి. సుబ్బరాయుడు దేవగుడిపల్లి.

ప్ర: "రామారావు సీతారామరాజు" తీస్తాడంటారా? అని ఒక పాఠకుడడిడితే "నమ్మకం" లేదన్నారు మీరు. అంటే నాగేశ్వర్రావు ఏదైనా సాధిస్తాడని మీ భావం. అవునా?

జ: చెబితే సాధిస్తాడు. చెప్పడుగా!

కె. సత్యమూర్తి-దేవగుడిపల్లె.

ప్ర: "రామారావుకి తిరుపతి కంచుకోట" అని ఒక పాఠకుడడిగిన ప్రశ్నకు "నాగేశ్వర్రావుకు మద్రాసు" అన్నారు. ఎందువల్ల?

జ: యీ కంచుకోటల కదలు ఉత్త భ్రమలు. యెవరికీ ఏదీ కంచుకోట కాదు. రెండుమూడేళ్ళు పోతే మరెవరో వస్తారు పెద్ద హీరోలుగా ముందుకు! అనవసరమైన "ముళ్లు" వేసుకొని ఆలోచించకండి!

ఎస్. పుష్ప, ఎం. బి ఢి.

ప్ర: నేను అంద వికారంగా వుంటాను. అయినా మా బావ నన్నెంతో ప్రేమిస్తారు, యెందుకంటారు?

జ: అందం విగ్రహంలో వుండదు చెల్లీ! గుణంలో వుంటుంది. నీ మనస్సెంత మంచిదో దాన్నిబట్టి తెలుసుకోవచ్చు నేనే "చెల్లీ" అన్నానుగదమ్మా!

ప్ర: అటువంటి మా బావను నేను యెలా సంతృప్తిపరచగలను జీవితాంతం?

జ: నిన్నెందుకు ప్రేమించాడో అందుకే సంతృప్తి పడతాడు ప్రత్యేకించి నువ్వేం చెయ్యనక్కర్లేదు. అలా కానినాడు అతడిది నిజమైన ప్రేమ కాబోదు!

చంద్రసత్యం, మానేపల్లి.

ప్ర: పద్మశ్రీ ఎన్. టి ఆర్. "జ్ఞానం" అనే మాటను "గ్నానం" అని పలికి లాంగ్వేజ్ ఖూనీ చేస్తారు. ఉచ్చరించలేని మాటను డైలాగ్స్‌నుంచి యెందుకు తీసివేయరు?

జ: తీసేస్తే ఒప్పుకోరేమో ఆయన!


ప్ర: రసికుడైన శ్రీనాథ మహాకవి యిప్పుడుంటే గ్లామర్ క్వీన్ విజయనిర్మల్ని యెలా వర్ణించివుండేవాడో?

జ: చచ్చేవాడు శ్రీ శ్రీ లాగ సినిమా డైలాగుల్లో పడి! అతణ్ణలా బ్రతకనివ్వండి యిందులోకి లాగక!

యం. రాజేంద్ర, అంబర్‌నాథ్.

ప్ర: వేశ్య మహా తీపి. యెందువల్ల?

జ: వచ్చినవాడు మళ్ళీరావాలనుకుంటుంది గనుక అన్ని రసాలూ సరసాలూ చూపిస్తుంది సరదాలిస్తుంది, సంతోషాలతో సువాసనల్లో దాచుకుంటుంది.



పసికూన! వెండికప్పులు షీల్డులు మెడల్సు సంపాదించుకుంది కూచిపూడి కళా విన్యాస విన్యాసాల్లో! పేరు మస్తానమ్మ. తెనాలి వాస్తవ్యులు శ్రీరాములుగారి చిరంజీవి. వయసుకు మించిన విద్యనిచ్చారు గురుదేవులు శ్రీ ఎండమూరి నారాయణగారు. చలనచిత్ర నిర్మాతలు ఒకసారి దృష్టి సారించవచ్చు యీ పసిపాప ప్రజ్ఞమీద.

యెలా మరచిపోగలం యెవరు మాత్రం?—తీసి కాదా?

బొమ్మ వెంకటయ్య, వరంగల్.

ప్ర: ప్రస్తుతం నటి సూర్యకళ ఏం చేస్తోంది?

జ: ప్రపంచ పోటీల్లో పాల్గొనడానికి లావెక్కుతోంది!

ఎస్. లాల్‌బాషా, రామచంద్రపురం.

ప్ర: అభినేత్రి రమాప్రభ కళ్ళను మీరెప్పుడైనా చూశారా?

జ: అంతవరకూ పోనివ్వలేదావిడెప్పుడూ నన్ను! నాగిరెడ్డిగారింట్లో పెళ్ళి పత్రికలా నిండుగా డాబుగా వుండేచోటే ఆగిపోతాయి నా కళ్ళెప్పుడూ!

కె. పాపయ్య, పెద్దపల్లి.

ప్ర: మంచిగా జీవితం గడపాలంటే పెద్దల్ని అనుసరించి గడపాలంటారా! స్నేహితులు చెప్పినట్టు వినాలంటారా?

జ: స్నేహితులు చెప్పినట్టు వినండి-వాళ్ళు మంచివాళ్ళనుకుంటే. "పెద్దల్ని" నమ్మద్దు! చాలా విషయాల్లో చాలా రంగాల్లో తేలిపోతోంది వారి చరిత్ర!

బి ఎన్. సింగ్, తెనాలి.

ప్ర: శ్రీ జగ్గయ్యగారి అభిమానసంఘం నెలకొల్పుతున్నాము. వారు రావాలి. వస్తారా?

జ: నెలకొల్పండి. నేనూ వస్తాను వారితో. నేను ముఖ్య అభిమానిని ఆ సమున్నత సంస్కారికి!

సోమంచి వసుంధర, అనంతపూర్.

ప్ర: జి. వరలక్ష్మి "తప్పటడుగులు" మానుకుందా?

జ: కోక? — మూగజీవులు" మూటాముల్లీ సర్దుకుని వెళ్ళిపోయారు!

ప్ర మీ హ్యూమరస్ ఆర్టికిల్స్ అద్భుతం! వాటినే యెక్కువగా ప్రచురించరాదూ?

జ: వచ్చు! కాని చాలామందికి అర్థంకాక-నిజం అనుకుని వివరాలకోసం వ్రాస్తున్నారు! అందుకే తగ్గించాను ఆ సెక్షను! ★

ఆఖరు పేజీ

త్రాగుబోతు అంటే త్రాగేవాడనేనా అర్థం? కాదు—


నా అభిప్రాయంలో త్రాగేవాడెప్పుడూ త్రాగుబోతు కాడు. త్రాగుతాడు - స్పృహ తప్పిపోతాడు అంతే—

స్పృహలో వుండికూడా స్పృహ లేకుండా త్రాగిన వాళ్ళకంటె హైకంగా వ్యవహరిస్తారు కొందరు! వాళ్ళ మాటే మిటి? త్రాగుబోతులనాలా అంతకంటె ఎక్కువ అనాలా? యింకా అంతకంటె ఎక్కువ పేరుపెట్టి పిలవాలా!

త్రాగినవాడు తను వున్న పరిస రాల్లోనే—అంటే ఆ పరిధిలోనే స్పృహ తప్పుతాడు. కొంచెం ఎక్కువైతే కేక లేస్తాడు. అల్లరి చేస్తాడు. అంతే.

కొంతమంది బుద్ధిమంతులు యెన్ని వాళ్ళనీ విన్నవాళ్ళనీ చెప్పినవాళ్ళనీ రాసే వాళ్ళనీ అందర్నీ "ఏం చేస్తామో చూడు-చంపేస్తాం" అంటూ బయలుదేరతారు రౌడిల్లా! వీళ్ళు సహజంగా రౌడీలు కారు గనుక రౌడీలను తెచ్చుకుంటారు తమ కూడా! ఎందుకంటే యెదటి వాళ్ళనీ అన్నవాళ్ళని రాసినవాళ్ళనీ కొట్టాలని కాదు—ఎటు తిరిగి యెటువచ్చినా నేరం తమది కాదనీ - ఆ రౌడీలదనీ చెప్పి తప్పించుకుందుకు. యీ త్రాగుబోతులు కాని త్రాగుబోతులకు స్పృహ తప్పినా తెలివి వుంటుంది. అది కొంపలార్పే తెలివి. త్రాగేవాళ్ళ కెక్కడుంటాయి అన్ని తెలివితేటలు—దొరికిపోవడం తప్ప!

"త్రాగడయ్యా యెంత మంచివాడు!" అనిపించుకుంటారు కొంతమంది.



విజయనిర్మల హరనాథ్‌ను పెళ్ళిచేసుకుంది. మూడు ముళ్ళూ వేశాడు హరనాథ్. రెండూ రెండు అందమైన ముఖాలు - అన్యోన్య దాంపత్యం అనక తప్పదు. పది కాలాలు సుఖంగా వర్ధిల్లమని దీవించారు ఆహూతులు. దిగ్విజయా వారి "ప్రేమ కానుక"లో ఒక దృశ్యం!

త్రాగుబోతులున్నారు జాగ్రత్త!

హీరో హరనాథ్ రచన

రౌండ్లు కొట్టినా గోడకి కొట్టిన ఫ్రేముల్లా కిక్కురు మనకుండా కూర్చుంటారు. మాట్లాడించినా మాట్లాడరు! వాళ్ళనే మనాలి?—త్రాగుబోతులు అనే అనాలా? అలాంటప్పుడు త్రాగి అల్లరిచేసే వాడినీ త్రాగుబోతు అని, బుద్ధిగా వుండేవాణ్ణీ త్రాగుబోతు అంటే న్యాయం వుందా? ధర్మం వుందా?—ఇదో పెద్ద సందేహం నాకు.

అయితే—స్పృహ తప్పిన త్రాగుబోతులు కొందరు తమ పరిసరాల్లోనే గొడవ చేస్తారు. అల్లరి అనికూడా అంటారు దాన్నే. పోలీసులొస్తే "ప్రొహిబిషన్" అంటారు. ఆ చట్టంమీద కేసు పెడతారు. అల్లరి చేసినందుకు వేరే. "కుడిచిటి గలాటా పణ్ణిటియా?" అని అడుగుతారు కోర్టులో. అవును అని తేలితే రెండింటికీ కలిపి వేస్తారు శిక్ష. ఇది త్రాగిన వాళ్ళకీ—అల్లరి చేసిన వాళ్ళకీ!

ఏమీ త్రాగకుండా చాలా బుద్ధిమంతు లనిపించుకుంటూనే గొప్పవాళ్లు అనిపించు కుంటూనే మేధావులుకొందరుదేశంఅంతా అల్లరవుతారు అల్లరి చేస్తారు అంతవరకూ దాన్ని న్యూసెన్సు అనవచ్చు—లేకపోతే పెద్ద న్యూసెన్సు అనవచ్చు. దీనిమీద ఎవరూ ఏ చర్యా తీసుకోరు! పోలీసులు "ప్రొహిబిషన్"మీద గాని మరి దేనిమీద గానీ కేసులు పెట్టలేరు. పెట్టరు! - కాని వింతేమిటంటే - ఎవరేనా బయటివాళ్ళు "ఏమిటీ న్యూసెన్సు" అనుకునే పరిస్థితి ఏర్పడేటప్పటికి వాళ్ళకి త్రాగకుండానే మరింత "కిక్" వస్తుంది. దాంతో అన్న

"ఆడదాన్ని కన్నెత్తి చూడడయ్యా!" అని యోగ్యతా పత్రాలు లభిస్తాయి కొందరికి.

"రామ రామ — సిగరెట్టు కూడా కాల్చడు!" అని ఆశ్చర్యం కలిగిస్తారు యింకా బుద్ధిమంతులు. జనం మెచ్చు కుంటారు. పత్రికలు రాస్తాయి కూడా. నమ్మచ్చు—

తప్పులేదు!

కాని ఎవరు బుద్ధిమంతులో యెవరు యోగ్యులో - స్పృహలో వుంటే—అది తప్పకపోతే యెవరి హృదయాలకు వాళ్ళకి తెలుసు. త్రాగేవాళ్ళకి త్రాగినప్పుడే స్పృహ తప్పుతుంది. త్రాగని వాళ్ళలో ఎప్పుడూ స్పృహలో లేనివాళ్ళుంటారని మొదటే చెప్పాను!

అది వ్యభిచారి అంటాం ఒక్కొక్క ఆడదాన్ని చూపించి.

కాని దానికి తెలుసు తన దగ్గరకి ఎవడొచ్చి వెళ్ళిందీ! లోకాని కెలా తెలుస్తుంది?

"వాడు పరమ త్రాగుబోతు"అంటారు కొందరు ఒకణ్ణి చూపించి!

కూడా కూర్చుని త్రాగేవాడికే ఎక్కువగా తెలుస్తుంది యీ సంగతి. పక్కరోడ్ లోకి వెళ్ళి ఫోన్ చేస్తాడు అతగాడే! తర్వాత పోలీసులు వస్తారు!

ఫలానా యింట్లో దొంగతనం చేసింది యెవరు అన్న గొడవొస్తే - "వాడు అయివుంటాడు" అని ముందుగా తెల్పుకోగలిగిందీ చెప్పగలిగేదీ కూడా దొంగే. దొంగని దొంగే పట్టాలి. పడతాడు. అది సామెత!

అందుకే అపరాధ పరిశోధక దళాల్లో అన్ని అలవాట్లూ వున్నవాళ్ళు కూడా వుంటారు. ఏ అలవాటు వున్నవాళ్ళు ఆ అలవాటుతో స్నేహం చేసే - చివరికి పట్టేస్తారు కేసు! పట్టుకున్న వాడూ త్రాగాడు అంటే లాభం వుండదు. పట్టు కుందుకే త్రాగాడతడు, పై అధికార్లు కూడా ఒప్పుకుంటారు అతణ్ణి. ప్రమోట్ చేస్తారు పై రేంకులోకి!

త్రాగని వాళ్ళనీ—

త్రాగకుండానే స్పృహ తప్పిపోయి అల్లరయిపోయే వాళ్ళనీ—

చూస్తే నిజంగా జాలేస్తుంది. కాని వాళ్ళు మేధావులూ - బుద్ధిమంతులూను! ఏం చేస్తాం!!

మనిషికి అన్నిటికంటె పరువు ప్రతిష్టలు ముఖ్యం. కొందరికి అవి త్రాగిన వాళ్ళకంటె యెక్కువ నిషాలో వుంటాయి అవి లేకుండా - పోతున్నా యనుకున్నప్పుడు స్పృహ తప్పిపోతూ వుండడం - బాగా స్పృహ తప్పిపోవడం కూడా సహజం!

అలాటి వారికి నిజంగా నా సానుభూతి. పరువు వుందనుకోవడం వల్లా - కొనుక్కున్న దేదో పోతోంది అనుకోవడం వల్లా వచ్చే ముప్పు లివన్నీ.

అసలు పరువే లేదనుకుంటే - దాన్ని వేగన్ల తరబడి కొనుక్కుని దాచుకోక పోతే యీ ముప్పులేవీ వుండవు. సరుకుంటేనే కదా దొంగ వస్తాడు. దొంగిలిస్తాడు. దొంగిలించిన వాడెవడైనా పరువున్న వాళ్ళకూడా వెళ్ళారి [illegible] సరుకు పోయిందని చెప్పుకుందురు! [illegible] స్వాములూ — స్వతహాగా వుంటుంది. అది ఎవరో తీసేస్తే పోతుందా — అన లంటూ వుంటే!

త్రాగి రాయడం లేక త్రాగడం మానేశాను. అది చాలా పాడుపని. నాకు తెలుసు. సరదాకి రాశాను నాలుగు మాటలు. సరదాగానే చదువుకోండి—★



శ్రీ ఆదుర్తి

యీ నెలలోనే "మరో ప్రపంచం" చిత్రానికి ప్రారంభోత్సవం జరిపిస్తున్నారు. "సుడిగుండాలు" తర్వాత చక్రవర్తి చిత్రా నిర్మాతలకు యీ "మరో ప్రపంచం" మరింత ప్రోత్సాహాన్నిస్తుందనీ, రచయిత శ్రీ యూస్సన్ మంచి కృషి చూపించారనీ వార్తలు.

పబ్లిషర్ శ్రీ రామచంద్రన్ (11, సోమసుందరం స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-17). ప్రింటర్ శ్రీ రామచంద్రన్, ప్రియా ప్రింటర్స్, 9, ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్, మదరాసు-1. ఎడిటర్ - కామేశ్వర శర్మ.